## సింగిల్ పేజీ కథలు

**'ఆరు నెలల్లో రిటైరవబోతున్నాను' పదవసారి గొణుక్కున్నాడు పరంధామయ్యగారు.**

# పరిష్కారం

**తనకు అనుకూలవతియైన భార్య, బుద్ధిమంతులైన పిల్లలు వున్నారు. అయినా తన యాభై ఎనిమిదేళ్ళ జీవితంలో సంపాదించుకుని మిగుల్చుకోగలిగింది ఏమీ లేకపోయింది. బాధ్యతలు బాధ్యతలుగానే మిగిలిపోయాయి.**

''అమ్మా! నాన్నగారు షికారు నుంచి వచ్చేశారు'' తల్లితో చెబుతున్న పెద్దకూతురు పార్వతిని చూసేసరికి ఆయనకి మరోసారి తన బాధ్యత గుర్తుకొచ్చినట్టుంది.

'తను డబ్బేమీ వెనుకేయలేదు. ఎన్ని చట్టాలు చేస్తేనేమి, ఎన్ని ప్రతిజ్ఞలు చేయిస్తేనేమి, కట్నం లేకుండా పెళ్ళి జరగదు'

''అమ్మా!'' అంటూ ఇంట్లోకి వస్తూన్న పెద్దకొడుకు రామం పిలుపుతో మరొక్కసారి ఉలిక్కిపడి వర్తమానంలోకి వచ్చాడు.

తన పెద్దకొడుకును చూడగానే మళ్ళీ మనసులో 'వీడు బిఏ పాసయి ఖాళీగా తిరుగుతున్నాడు. టైపు కూడా పాసయ్యాడు. కంప్యూటర్ కోర్స్ నేర్చుకుంటున్నాడు. వీడికి ఉద్యోగం ఎప్పటికి దొరుకుతుందో?' అన్న దిగులు ఏర్పడింది.

''భోజనానికి లేవండి'' అని సత్యవతమ్మగారు అనగానే ఆలోచనలను కట్టిపెట్టి కాళ్ళు కడుక్కోడానికి పెరట్లోకి వెళ్ళారు పరంధామయ్యగారు.


వంటింట్లో ఎక్కడివక్కడ సర్దేస్తున్న భార్యను చూసి, ఎందుకో ఆ గదిలోనికి వచ్చిన పరంధామయ్యగారు వచ్చిన పనినే మరచిపోయి తిరిగి ఆలోచనలో పడిపోయారు.

'తనతో ఇంచుమించుగా ముప్పై సంవత్సరాలు కలిసి సంసారయాత్ర సాగించింది. కాని తనేమి చెయ్యగలిగాడు- తన ధర్మపత్నికి! కనీసం ఆవిడ పేరున ఏమైనా మిగిల్చాడా? పుట్టింటినుండి అరణంగా తెచ్చుకున్న అర ఎకరం నేలకూడా పెద్ద కొడుకు చదువు నిమిత్తం కరిగించేసాడు. ఇంక చిన్నవాళ్ళు నలుగురు ఎప్పటికి పెరిగి పెద్దయ్యేను?' అనుకుంటూ మంచంమీద నడుం వాల్చారు.

''ఇంకా నిద్రపోలేదా?'' అంటూ సత్యవతమ్మగారు అడిగారు చాప పరుచుకుంటూ.

''ఊహు! ఆలోచనలతో నిద్రపట్టడం లేదు''

''ఏమిటోనండీ పిల్లలకి పెళ్ళి చెయ్యాలి. మన చేతిలో చిల్లిగవ్వలేదు. పోనీ పెద్దవాడు ఏమైనా సంపాదిస్తే దానిలో ఏమైనా మిగిల్చి చేద్దామనుకుంటే వాడు రెండేళ్ళనుండి చదువైపోయి ఖాళీగా



తిరుగుతున్నాడు'' అంటూనే ఆవిడ నిద్రలోకి ఒరిగిపోయారు.

పరంధామయ్యగారు ఒకసారి ఆవిడకేసి చూసి నిట్టూర్చారు.

ఆలోచిస్తుండగానే తళుక్కున ఒక ఆలోచన తటిల్లతలా మెరిసింది. దాంతో ఒక రకమైన తృప్తి ఆయన హృదయంలో నిండిపోయేటప్పటికి ఆయనకి తెలియకుండానే నిద్రముంచుకొచ్చింది.

రెండు నెలల కాలం గడిచింది. పరంధామయ్య పెద్దకొడుకు రామం, ఆయన పనిచేస్తున్న ఆఫీసులోనే క్లర్క్‌గా చేరాడు.

కట్నం డబ్బుకోసం సంబంధం కాదనుకుని వెళ్ళిపోయిన వారే తిరిగి కట్నం ఇవ్వగలరని తెలుసుకొని పరంధామయ్యగారి కుటుంబంతో సంబంధం కలుపుకుని తాంబూలాలు పుచ్చుకున్నారు.

''అమ్మా! ఫ్యామిలీ పెన్షన్ తాలూకు కాగితాలు ఇవిగో. వీటి మీద సంతకాలు పెట్టేస్తే త్వరగా పంపించేద్దాము. నాన్నగారికి ఎ.జి. ఆఫీసులో తెలిసిన అతను ఇవి త్వరగా చూసి, పెన్షన్ కూడా రెండు మూడు నెలల్లో వచ్చేలా చూస్తానన్నారు'' అంటున్న కొడుకును చూడగానే ఆవిడ కళ్ళు చెమ్మగిల్లాయి.

చటుక్కున అక్కడినుండి లేచిపోయి వంటింట్లోని పరంధామయ్యగారి ఫొటో దగ్గరకు వచ్చి, 'ఎందుకు మమ్మల్ని అన్యాయం చేసి వెళ్ళిపోయారండీ?' అని మూగగా అడుగుతున్నట్టుగా నిలబడ్డారు.

రామానికి కూడా గొంతులో ఏదో ఉండ పడినట్లయి, దిగమ్రింగుకున్నాడు. కాని తనకి మాత్రం తెలుసునా నాన్నగారు రోజూ అలవాటుగా వేసుకునే నిద్రమాత్రలు ఎక్కువగా ఎందుకు వేసుకున్నారో?

పరంధామయ్యగారు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో తెలిసిన ఆయన బాల్యమిత్రుడు సుబ్బారావుగారు మాత్రం, 'ఎంతపని చేశావ్ పరం' అని బాధగా అనుకుంటూ చిరిగి పోవడానికి సిద్ధంగా వున్న కాగితాన్ని మరొకసారి తెరిచి చదవడం ప్రారంభించాడు.

'ఒరేయ్ సుబ్బారావూ!

ఈ మనుష్య ప్రపంచంలోకి ఒక ఆరుగురిని పారేసి, నీ పరం అస్తమిస్తున్నాడురా. వారి సంరక్షణ ఎలా చూడాలో తెలీక ఒక పిరికివాడిలా ఆత్మహత్య చేసుకుంటున్నానని తిట్టుకుంటావేమో! ఎన్నో రాత్రులు నిద్రలేకుండా ఆలోచించి ఆలోచించి నిన్ననే నిర్ణయించుకున్నా. పరిష్కారం నాకిదే అనిపించింది.

నా కొడుకుకి ఉద్యోగం లేదు. నేను రిటైర్ అవుతున్నాను. నేను రిటైర్ అవుతున్నాననీ, ఆలోగా నా కొడుక్కి ఏదైనా ఉద్యోగం చూడమనీ అడిగితే ఎవరికైనా దయ కలుగుతుందేమో ఆలోచించు. అదే నేను చచ్చిపోయాననుకో- నా చావుకి ఒక రిజిస్ట్రేషన్ ఉంటుంది. పాపం వాళ్ళబ్బాయికి ఏదైనా ఉద్యోగం చూస్తే, ఆ సంసారం నిలబడుతుందనే జాలి ప్రతి ఒక్కరిలో కలుగుతుంది. ఒక మనిషి తల్చుకుంటే ఎంతో చేయగలడు. నేను చనిపోయానని దయతలిస్తే, మా ఆఫీసూ నాకోసం ఏదైనా చేయగలదు. మా అబ్బాయికి నా స్థానంలో ఉద్యోగం ఏర్పరుస్తారు. నేను రిటైర్ అయితే నా పిఎఫ్ వచ్చేందుకు సంవత్సరాలు పట్టొచ్చు. ఇప్పు

డైతే పాపం చచ్చిపోయాడని అంతా ఓ చెయ్యివేస్తే వారం రోజుల్లో ప్రభుత్వం నుంచి రావలసిన మొత్తం సొమ్ము నా సంసారానికి వస్తుంది. తద్వారా పిల్ల పెళ్ళవుతుంది.

ఒక సంసారానికి ఒక ఉద్యోగం, ఒక ఆడపిల్ల పెళ్లీ సంప్రాప్తించటానికి ఒక మరణం ఈరోజుల్లో ఏమంత గొప్ప పణం కాదు.

చివరగా, నా భార్య ఒకరిమీద ఆధారపడవలసిన పని లేకుండా ఫ్యామిలీ పెన్షన్ రూపేణా ఆవిడ బతికున్నంత కాలం కొంత మొత్తం వస్తుంది.

ఒకవేళ నేను రిటైరై ఏ గ్రహపాటునో మరణించినా వీరికెవ్వరికీ ఎటువంటి లాభమూ వుండదు. అందుకే ఈ నిర్ణయాన్ని తీసుకున్నాను. కొడుకుకి ఉద్యోగం, కూతురికి పెళ్ళి, భార్యకు జీవితాంతం ఆధారం- ఒక్క నా పనికిరాని మరణం వల్ల ఎన్ని ఉపయోగాలో చూడు. నేనీ ఆలోచనలతో ఇలా చేశానని నా భార్యాబిడ్డలకు ఎట్టి పరిస్థితిలోనూ చెప్పవద్దు. ఇది నా తుది శాసనంగా భావించుకో'

మిత్రుడి ఉత్తరం చదివిన సుబ్బారావుకి కళ్ళు చెమర్చాయి.

-బద్దిగం పాండురంగారెడ్డి
(జగిత్యాల)

# మేరా భారత్ మహాన్

పాకిస్తాన్ జైళ్ళలో 19 ఏళ్ళు కఠిన కారాగార శిక్ష అనుభవించి విడుదలై, స్వదేశానికి తిరిగొచ్చిన సిపాయి అతను. కాకినాడ నుండి కాశ్మీరు బోర్డరుకెళ్ళి బిఎస్ఎఫ్‌లో పనిచేస్తున్నప్పుడు విధి వక్రించి పాకిస్తాన్‌కి బందీగా దొరికిపోయిన విధి వంచితుడతను. రెండేళ్ళ వైవాహిక జీవితానికి ఫలితంగా ఏడాది కూతుర్ని భార్య చేతుల్లో వదిలివెళ్ళాడు. బాహ్య ప్రపంచానికి దూరంగా, ప్రత్యేక జైళ్ళలో ఎక్కడున్నదీ తెలియని చీకటి కారాగారాల్లో మగ్గి, విడుదలై భారతదేశపు పొలిమేరల్లో కాలు మోపగానే చుట్టుముట్టిన సైనిక సోదరులంతా అతని ఆకారాన్ని చూసి, ప్రశ్నల వర్షం కురిపించారు. అందరి ప్రశ్నా ఒక్కటే 'ఎంతగా చిత్రవధలు పెట్టార'ని. అలా అడుగుతూనే అక్కడున్న మిలిట్రీ క్యాంపుకి రాజ మర్యాదలతో తీసుకెళ్ళారు.

అక్కడున్న వాళ్ళందర్నీ పరికించి చూశాడతను. తనకు పరిచయమున్న వాళ్ళెవరూ లేరక్కడ.


వాళ్ళు మళ్ళీ ప్రశ్నించడం మొదలెట్టారు.

ఏమని చెప్పగలడు? ఎన్నని చెప్పగలడు?

మరుగుతున్న వేణ్ణీళ్ళు మొహం మీద వేగంగా విసరగా, మొహమంతా బొబ్బలెక్కి, అవి మానేసరికి చర్మమంతా రబ్బరు సాగదీసినట్టు సాగి, తన ఆకారాన్ని వికారంగా మార్చేసిన దుర్ఘటన చెప్పి, తల పక్కకి తిప్పి చెవుల కింద మెత్తటి తమ్మెలను కత్తితో కసాయితనంగా కోసిన సంఘటన చెబుతుంటే...

అక్కడున్న వాళ్ళలో ఒకతను ఉండబట్టలేక ''ఇంత దారుణంగా హింసిస్తుంటే ఎలా భరించగలిగారు?'' అనంటే

''మాతృభూమి రక్షణ కోసం దేహం మీద తేలుతున్న గాయాల్ని భరిస్తున్నప్పుడు శరీరానికి బాధ కలిగేదే తప్ప, మనసుకి ఏనాడూ వేదన కలగలేదు'' అనతడు నవ్వుతూ చెబుతూంటే, నోటిలో ముందువరస పళ్ళేవీ కన్పించలేదుగానీ, అతని కళ్ళనుండి ఆనందాశ్రువులు రాలడం అక్కడున్న వాళ్ళందర్నీ కదిలించింది.



సైనిక సోదరులంతా ''మేరా భారత్ మహాన్'' అంటూ అతన్ని ఆకాశానికెత్తినంత పనిచేశారు.

సైనిక సోదరుల ఘన సన్మానాన్ని అందుకుని, రెండ్రోజుల రైలు ప్రయాణం చేసి, కాకినాడలో దిగి, తమ గ్రామానికెళ్ళే బస్సెక్కాడు. బస్ రద్దీగా ఉంది. తన సూట్‌కేసూ, బ్యాగూ పైన పెట్టి ఓ పక్కగా నుంచున్నాడు.

బస్‌లో ప్యాసింజర్లు ఎక్కువై ఒకళ్ళనొకళ్ళు నెట్టుకుంటుంటే ''కాస్త జరగండి'' అన్నాడతను తన మీద వాలిపోతున్న వ్యక్తితో.

''నువ్వే కాస్త వెనక్కెళ్ళవయ్యా బాబూ! నీ చెమట కంపు కడుపులో తిప్పుతోంది'' అన్నాడు సీట్లో కూర్చున్న ఓ యువకుడు.

క్షణం పాటు మనసు చివుక్కుమందతనికి.

ఇన్నేళ్ళూ అజ్ఞాతంగా తన దేహం దేశం కోసం కార్చిన స్వేదం, ఇవ్వాళ జనజీవనంలో అనాఘ్రాణితమౌతోందన్న ఊహ తనకు రానందుకు నవ్వుకున్నాడు.

బస్సు భారంగా కదిలింది. కిటికీ నుండి వీస్తున్న చల్లని గాలి బహిర్ స్వేదాన్నీ, అంతర్వేదాన్నీ స్వాంత పరుస్తున్నట్లనిపించింది. తను పుట్టి పెరిగిన ఊరుని, తన వాళ్ళని చూడబోతున్న ఆనందం, కిక్కిరిసిన జనం మధ్యలో నిలబడ్డ అతని కాళ్ళకి నెప్పి తెలియనంతగా మనసులో సుఖాశీనమైంది. గంటన్నర తర్వాత అతను దిగాల్సిన ఊరులో బస్సు ప్రవేశించింది. అప్పటి ఆనవాళ్ళు చెదురుమదురుగా కనిపించాయి.

సెంటర్లో బస్సు ఆగగానే సూట్కేసూ, బ్యాగూ తీసుకుని బస్సు దిగాడతను. కండక్టరిచ్చిన చిల్లర జేబులో వేసుకుందామని చెయ్యిందేసరికి, ప్యాంటుకి జేబులేదు. అందులో ఉన్న పర్సూ లేదు. ఆశ్చర్యపోయాడు. బస్‌లో ఎవరో బ్లేడుతో అతని శరీరంపై గాయం పడకుండా జేబు కత్తిరించి పర్సు కొట్టేశారు.

అనుమానంతో సూట్కేసు తాళం చూసుకుని, బ్యాగువైపు చూశాడు. జిప్ పక్కన పొడవుగా కత్తిరించి ఉంది. గబగబా బ్యాగులో ఉన్న బట్టలన్నీ బయటికి తీసి, ఎంత వెతికినా కన్పించని 'ఆ వస్తువు' కోసం అతని మనసు విలవిల్లాడింది.

పరాయి దేశంలో శరీరంపై పడ్డ గాయాల్ని సంవత్సరాల తరబడీ అనుభవించిన అతన్ని ఈ సంఘటన మానసికంగా తీవ్రంగా గాయపరిచింది.

అది ఇరవై ఏళ్ళుగా తను చూడని కన్నకూతురి కోసం ఢిల్లీలో కొన్న బంగారు గాజులున్న కవరు దొంగల పాలవటం తట్టుకోలేక ప్రయత్నంగానే అతను 'మేరా భారత్ మహాన్'. అని అందరికీ విన్పించేలా అంటుంటే, వింతగా చూడసాగారక్కడున్న వాళ్ళంతా.

-ఎం.వెంకటేశ్వరరావు
(సికింద్రాబాద్)